నేటి నుంచి మద్యం షాపులు బంద్

ఖిలావరంగల్, ఫిబ్రవరి 24: ఈనెల 27న ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్ ఉన్నందున మంగళవారం నుంచి నుంచి మద్యం దుకాణాలు మూసివేయనున్నట్లు కలెక్టర్ సత్యశారద ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం సాయంత్రం 4గంటల నుంచి 27వ తేదీ సాయంత్రం 4గంటల వరకు మద్యం షాపులు, బార్ అండ్ రెస్టారెంట్లు బంద్ ఉంటాయని పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘిస్తే చట్ట రీత్యా చర్యలు ఉంటాయని హెచ్చరించారు.

నర్సంపేట మార్కెట్‌కు నాలుగు రోజులు సెలవులు

నర్సంపేట, ఫిబ్రవరి 24: పట్టణంలోని వ్యవసాయ మార్కెట్‌కు మంగళవారం నుంచి నాలుగు రోజుల పాటు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కమిటీ చైర్మన్ పాలాయి శ్రీనివాస్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 25న మంగళవారం వారాంతపు సెలవు, 26న మహాశివరాత్రి పర్వదినం, 27న వ్యాపారుల కోరిక మేరకు జాగరణ సెలవు, 28న అమావాస్య సెలవు ప్రకటించినట్లు వివరించారు. తిరిగి మార్చి 1వ తేదీన మార్కెట్ కార్యకలాపాలు యథావిధిగా కొనసాగుతాయని పేర్కొన్నారు.

నెక్కొండ: పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ రాజ్‌కుమార్

పోలింగ్ కేంద్రాల పరిశీలన

నెక్కొండ/ చెన్నారావుపేట, ఫిబ్రవరి 24: టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రాలను అధికారులు సోమవారం పరిశీలించారు. నెక్కొండ హైస్కూల్, చెన్నారావుపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల పోలింగ్ కేంద్రాలను నర్సంపేట ఆర్డీవో ఉమారాణి పరిశీలించారు. ఆర్డీవోతో తహసీల్దార్లు రాజ్‌కుమార్, ఫణికుమార్, ఆర్ఐలు నరేందర్, ఆర్ఐ రషీద్ ఉన్నారు. పోలింగ్ కేంద్రంలో వెలుతురు, నీరు తదితర సౌకర్యాల ఏర్పాట్లపై పలు సూచనలు చేశారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

నర్సంపేట/చెన్నారావుపేట, ఫిబ్రవరి 24: ఇంట్లో అక్రమంగా నిల్వ చేసిన పీడీఎస్ బియ్యాన్ని పోలీసులు సోమవారం పట్టుకున్నారు. నర్సంపేట మండలం గురిజాలకు చెందిన గోలి రవీందర్ పీడీఎస్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నాడనే సమాచారంతో టాస్క్ ఫోర్స్ ఏసీపీ మధుసూదన్ ఆదేశాల మేరకు ఎస్సై రాజు, పోలీసులు దాడి చేశారు. ఇంట్లో నిల్వ చేసిన రూ.59,800 విలువైన 23క్వింటాళ్ల పీడీఎస్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆర్ఎస్ఐ భానుప్రకాశ్ ఉన్నారు. కాగా, చెన్నారావుపేట మండలం టిక్యాతండా గ్రామ పంచాయతీ శివారు బొగ్గుతండాలో మాలోత్ వాగ్యకు చెందిన రేకుల షెడ్డులో అక్రమంగా నిల్వ ఉంచిన రూ.80వేల విలువైన 32క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకున్నారు. రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచిన పాషాను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్‌రెడ్డి తెలిపారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

jobs Apply Now!

★లేడీ టెలికాలర్స్, బ్యాగ్రౌండ్ పెయింటర్స్, కార్టూన్స్ వేసే ఆర్టిస్టులు వెంటనే కావలెను. సంప్రదించండి: 8074288199, హైదరాబాద్.
NT-329857

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
9182777961
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

జిల్లా సహకార మార్కెటింగ్ సంఘంలో అక్రమాలు

అధికారులు, ప్రజాప్రతినిధులకు మాజీ ఉద్యోగి ఫిర్యాదు

కరీమాబాద్, ఫిబ్రవరి 24: ఓరుగల్లు జిల్లా సహకార మార్కెటింగ్ సంఘంలో అక్రమాలు జరిగాయని సంస్థ మాజీ ఉద్యోగి ఆరోపించా రు. సోమవారం ఎస్ఆర్ఆర్ తోటలోని సంఘ భవనంలో పాలకవర్గ సమావేశానికి హాజరై తనకు రావాల్సిన బెనిఫిట్స్ ఇవ్వాలని కోరారు. పలు ఆరోపణల ఫిర్యాదు కాపీలను పత్రికలకు అందజేశారు. ఆధారాలతో ఉన్నతాధికారులకు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదు చేసినట్లు పేర్కొన్నారు. డీసీఎంఎస్ అధ్యక్షులు, పాలకవర్గంతో పాటు బిజినెస్ మేనేజర్ నిబంధనలను తుంగలో తొక్కి అనేక అక్రమాలకు పాల్పడినట్లు వివరించారు. రూ.85లక్షలతో చేపట్టిన జిల్లా స్థాయి భవన నిర్మాణానికి ప్రజాప్రతినిధులు, పీఏసీఎస్‌ల అధ్యక్షులను ఆహ్వానిస్తే అవినీతి బయటపడుతుందని గుట్టుచప్పుకాకుండా ప్రారంభించారని ఆరోపించారు. రూ.85లక్షల అంచనా వ్యయంతో అనుమతి పొంది కాంట్రాక్టర్‌తో రూ.65లక్షలతో అగ్రిమెంట్ చేసుకుని, రూ.20లక్షలు కాజేశారని, నూతన భవన నిర్మాణానికి కాంట్రాక్టర్ చెల్లించాల్సిన జీఎస్టీని సంఘం చెల్లించేలా తీర్మానం చేసి రూ.15లక్షలు నష్టం చేకూర్చారని, భవన నిర్మాణం ఆమోదిత ఇంజినీర్ ద్వారా ధ్రువీకరించి సహకార కమిషనర్ అనుమతి పొందకుండా భవన నిర్మాణంలో అనేక మార్పులు చేశారని, సీఎంఎస్ పరకాల ద్వారా సంక్రమించిన స్థలంలో ప్రహరీ నిర్మాణానికి రూ.29లక్షల వ్యయంతో అనుమతి పొంది రూ.19లక్షలకు కాంట్రాక్టర్‌తో అగ్రిమెంట్ చేసుకుని రూ.10లక్షలు అవినీతికి పాల్పడ్డారని, సంఘానికి సంబంధం లేని స్థలంలో మట్టి పోసినట్లు రూ.8లక్షలకు నకిలీ బిల్లులు సృష్టించారని, సంఘంలో కమీషన్ ఏజెంట్లుగా పనిచేస్తున్న వారి వద్ద నుంచి జీఎస్టీ వసూలు చేసి, ప్రభుత్వానికి చెల్లించకుండా దాదాపు రూ.30లక్షలు దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ఈ అంశాలపై ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు ఆధారాలతో ఫిర్యాదు చేయగా తనను ఇబ్బందులకు గురిచేశారని, అందుకే ఉద్యోగానికి రాజీనామా చేసినట్లు తెలిపారు. విచారణ చేపట్టి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

ఓరుగల్లు జిల్లా సహకార మార్కెటింగ్ సంఘం భవనం

అశిరెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ఎర్రబెల్లి దయాకర్‌రావు

మృతుల కుటుంబాలను ఆదుకుంటా

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

రాయపర్తి, ఫిబ్రవరి 24: మండలంలోని పలు గ్రామాల్లో మృతుల కుటుంబాలను ఆదుకుంటానని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. సోమవారం మండలంలోని కొండూరులో ఇటీవల మృతిచెందిన కర్ర అశిరెడ్డి, చిర్ర నితిన్‌కుమార్‌ల కుటుంబాలను కలిసి పరామర్శించారు. ఈ సందర్భంగా కర్ర అశిరెడ్డి, చిర్ర నితిన్‌కుమార్ చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. బీఆర్ఎస్ నాయకులు కర్ర శ్రీనివాస్‌రెడ్డి, జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, కర్ర రవీందర్‌రెడ్డి, పూస మధు, కుందూరు యాదగిరిరెడ్డి, వీరమనేని సత్యనారాయణరావు, లేతాకుల రంగారెడ్డి, పులి సోమయ్యగౌడ్, చిర్ర ఉపేంద్ర, కిశోర్‌కుమార్ పాల్గొన్నారు.

శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న కలెక్టర్ సత్యశారద

పారదర్శకంగా పోలింగ్ నిర్వహించాలి

ఖిలావరంగల్, ఫిబ్రవరి 24: వరంగల్, ఖమ్మం, నల్గొండ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలను పారదర్శకంగా నిర్వహించాలని కలెక్టర్ సత్యశారద అధికారులకు సూచించారు. ఈనెల 27న జరిగే పోలింగ్ ప్రక్రియపై సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో పీవో, ఏపీవో, సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం మార్గదర్శకాలు, నిబంధనలను తెలుసుకోవాలన్నారు. బ్యాలెట్ పద్ధతిలో జరిగే ఎమ్మెల్సీ పోలింగ్ ప్రక్రియలో ఓటింగ్ నిర్వహణకు కొంత ఎక్కువ సమయం పట్టే అవకాశాలు ఉన్నందున ఓపికతో ఉండాలన్నారు. ఈ గురువారం ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు పోలింగ్ ఉంటుందని, గడువులోగా పోలింగ్ కేంద్రంలోని క్యూలో ఉన్న వారికి వరుస క్రమంలో టోకెన్ నంబర్లు అందించి ఓటింగ్ జరిపించాలన్నారు. ఈనెల 26వ తేదీన ఉదయం ప్రిసైడింగ్ అధికారులు తమ బృందంతో డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ సామగ్రి, బ్యాలెట్ బాక్సులు చెక్ లిస్ట్ ప్రకారం పరిశీలించుకోవాలన్నారు. సమకూర్చిన వాహనంలోనే నిర్దేశిత పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలని సూచించారు. పోలింగ్ పూర్తయిన తర్వాత పక్కాగా రికార్డు బుక్కుల్లో వివరాలను పొందుపరుస్తూ నివేదిక తయారు చేయాలని సూచించారు. మాస్టర్ ట్రైనర్ శ్రీనివాస్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అదనపు కలెక్టర్ జీ సంధ్యారాణి, ఎన్నికల ఏఆర్వో విజయలక్ష్మి పాల్గొన్నారు.

వంద శాతం ఫలితాలు సాధించాలి

పర్వతగిరి, ఫిబ్రవరి 24: ఎస్సెస్సీ పరీక్షల్లో వంద శాతం ఫలితాలు సాధించాలని జిల్లా కామన్ పరీక్షల సెక్రటరీ గారే కృష్ణమూర్తి అన్నారు. మండల కేంద్రంలోని హైస్కూల్‌ను సోమవారం ఆయన సందర్శించి ఎస్ఎస్‌సీ విద్యార్థులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులు సెల్‌ఫోన్‌కు దూరంగా ఉండాలని సూచించారు. మంచి ఆహారం తీసుకోవాలని చెప్పారు. క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు ఎదగాలని కోరారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాక రమేశ్‌బాబు, డాక్టర్ మడత భాస్కర్ పాల్గొన్నారు.

వరద కాల్వను పూడ్చి.. ప్లాట్లుగా చేసి..

- అశోక్‌నగర్‌లో ప్రభుత్వ స్థలం ఆక్రమణ
- తెర వెనుక రాజకీయ నాయకులు
- ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వదిలేసిన రెవెన్యూ అధికారులు

ఖానాపురం, ఫిబ్రవరి 24: మండలంలోని అశోక్‌నగర్‌లో ప్రభుత్వ స్థలం ఆక్రమణకు గురవుతున్నది. గ్రామానికి చెందిన కొందరు ప్రభుత్వ స్థలాన్ని దర్జాగా ఆక్రమించి ప్లాట్లుగా మార్చుతున్నారు. డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టు వరద నీరు వెళ్లేందుకు తవ్విన కాల్వను పూడ్చేసి ప్లాట్లు చేశారు. పదిహేనేళ్ల క్రితం ఇళ్లు నిర్మించుకున్న పేదల ఇళ్ల స్థలాలను సైతం వారు వదలడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అశోక్‌నగర్ సబ్‌స్టేషన్ వెనుక సర్వేనంబర్ 226లో 30 గుంటల ప్రభుత్వ స్థలం ఉంది. డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టు నిండినప్పుడు ఎక్కువైన నీళ్లు బయటికి వెళ్లేందుకు అందులో నుంచే కాల్వ తీశారు. గ్రామానికి చెందిన ఓ రాజకీయ పార్టీ నాయకులు దాన్ని ఆక్రమిస్తున్నారు. వారు నేరుగా భూమిపైకి వస్తే అధికారులతో సమస్యలు వస్తాయని గ్రామంలో అనుకూలమైన కొందరిని ముందు పెట్టారు. వారు ప్లాట్లు చేసి ఇచ్చినందుకు ప్రతిఫలంగా ఒక్కో ప్లాటుకు కొంత ముట్టజెబుతామని, వారికి ప్లాట్లు ఇస్తామని ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో 30గుంటల ప్రభుత్వ స్థలాన్ని చదునుచేసి ప్లాట్లుగా మార్చారు. డీ ఫ్లోరైడ్ ప్రాజెక్టు నిండినప్పుడు ఎక్కువైన నీళ్లు బయటికి వెళ్లడానికి తీసిన కాల్వను కొంత పూడ్చేసి చదునుచేసి దానిపై ప్లాట్లు చేశారు. ఒక్కొక్కరికి ఒక్కో ప్లాటు కేటాయించారు. అందుకు ఒప్పందం ప్రకారం రూ.3లక్షలకు పైగా పార్టీ నాయకులు తీసుకున్నారు. ఓ రాజకీయ పార్టీ నాయకులు వెనుక ఉండి ప్లాట్లు చేయిస్తున్న విషయాన్ని మరో పార్టీ నాయకులు రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో తహసీల్దార్ రాజారేణుక స్థలాన్ని సందర్శించి ఫ్లెక్సీ ఏర్పాటు చేసి వెళ్లారు. ఆ ఫ్లెక్సీని చింపేసి యథేచ్ఛగా ఆక్రమణ కొనసాగింది. అధికారులు అటువైపు వెళ్లిన దాఖలాలు లేవు. ఇదే అదనుగా మరో రాజకీయ పార్టీ నాయకులు మిగతా ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేయడం మొదలుపెట్టారు. వారు కూడా ఆక్రమించి ఇతరులకు విక్రయించి సొమ్ముచేసుకుంటున్నారని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఓ కులసంఘం భవనానికి విక్రయించినట్లు తెలిసింది. మరో కుల సంఘ భవన నిర్మాణానికి విక్రయించేందుకు ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఈ క్రమంలోనే సోమవారం 15ఏళ్ల క్రితం ప్రభుత్వ భూమిలో ఇల్లు నిర్మించుకున్న ఓ కుటుంబానికి చెందిన కొంత భూమిని సదరు నాయకులు తమకు ఇవ్వాలని బెదిరింపులకు పాల్పడడంతో ఘర్షణ జరిగింది. ఇంత జరుగుతున్నా అధికారులు కఠిన చర్యలు తీసుకోవడంలేదు. గ్రామంలో ప్రభుత్వ స్థలం ఉన్నందున కేజీబీవీ, సబ్‌స్టేషన్, రైతువేదిక మంజూరయ్యాయని, భవిష్యత్‌లో అవసరాలకు ప్రభుత్వ స్థలం లేకుండా కబ్జా చేస్తున్న వారిపై అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఇన్‌చార్జి తహసీల్దార్‌ను వివరణ కోరగా కబ్జా విషయం తమ దృష్టికి వచ్చిందని, ప్రభుత్వ స్థలం ఎవరూ కొనుగోలు చేయవద్దని ఫ్లెక్సీ ఏర్పాటు చేశామని, ఇప్పటివరకు నిర్మాణాలు జరగలేదని తెలిపారు. ప్రభుత్వ స్థలం కబ్జా కాకుండా చర్యలు చేపడతామని చెప్పారు.

పూడ్చేసిన కాల్వపై కబ్జాదారులు పోసిన మొరం

మిర్చి క్వింటాల్‌కు రూ.25వేలు చెల్లించాలి

ఆల్ ఇండియా కిసాన్ సభ కేంద్ర కమిటీ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి

కాశీబుగ్గ, ఫిబ్రవరి 24: ప్రభుత్వం మిర్చి క్వింటాళ్‌కు రూ.25వేలు చెల్లించి రైతులను ఆదుకోవాలని ఆల్ ఇండియా కిసాన్ సభ కేంద్ర కమిటీ సభ్యుడు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లోని మిర్చియార్డును సందర్శించారు. రైతులతో మాట్లాడి సమస్యలు, ధరలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యదర్శి జీ రెడ్యాను సమస్యలు వివరించారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మార్క్‌ఫెడ్ ద్వారా మిర్చి క్వింటాళ్‌కు రూ.25వేలతో కొనుగోలు చేయాలన్నారు. మిర్చి ఎకరానికి రూ.1.5లక్షల పెట్టుబడి అవుతోందని, దిగుబడి 10 నుంచి 20క్వింటాళ్లు వస్తోందని తెలిపారు. ప్రస్తుత ధరలతో రైతులకు పెట్టుబడులు కూడా రావడం లేదన్నారు. ప్రభుత్వం మిర్చి రైతులను వ్యాపారుల దయా దక్షిణ్యాలపై వదిలిపెట్టిందని విమర్శించారు. రైతులను మార్కెట్‌లో నిలువు దోపిడీ చేస్తున్నా పట్టించుకోవడం లేదని విమర్శించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు కనీసం మార్కెట్ వైపు కన్నెత్తి చూడడం లేదన్నారు. మిర్చి నాణ్యతను గుర్తించే పరికరాలను మార్కెట్‌లో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఎండీ బషీర్, ఈసంపెల్లి బాబు, గాదె ప్రభాకర్, చుక్కయ్య, అట్మల్‌పాషా, గన్నారపు ప్రభాకర్, దార కుమారస్వామి, లక్కరాజు పాల్గొన్నారు.

మిర్చియార్డును సందర్శించిన నాయకులు

గిట్టుబాటు ధర కల్పించాలి

నర్సంపేట: మిర్చికి గిట్టుబాటు ధర కల్పించాలని తెలంగాణ రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి ఈర్ల పైడి డిమాండ్ చేశారు. ఈమేరకు సోమవారం రైతు కూలీ సంఘం జిల్లా కార్యవర్గం ఆధ్వర్యంలో ఆర్డీవో కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందించారు. ఆయన మాట్లాడుతూ మిర్చి సాగుకు రైతులు పెట్టుబడి భారీగా పెట్టారని తెలిపారు. మిర్చి రైతులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని కోరారు. జిల్లా నాయకులు ఈరెల్లి రామచందర్, బర్ల గౌరయ్య, ఎలకంటి చిన్న కుమారస్వామి, అజ్మీరా శివారం, అజ్మీరా పూల్‌సింగ్, బక్కతట్ల శోభ, భాషబోయిన అనిత, బోనగిరి రామ్మూర్తి, రాజు, అందే లక్ష్మీనారాయణ ఉన్నారు.

చికిత్స పొందుతూ ఇద్దరి మృతి

వరంగల్ చౌరస్తా/ కరీమాబాద్, ఫిబ్రవరి 24: ఎంజీఎం దవాఖానలో చికిత్స పొందుతూ ఇద్దరు వేర్వేరు వ్యక్తులు సోమవారం మృతిచెందారు. ఈనెల 21న వరంగల్ జేపీఎన్ రోడ్డు పక్కన అపస్మారకస్థితిలో ఉన్న గుర్తుతెలియని వ్యక్తిని స్థానికులు 108 అంబులెన్స్‌లో ఎంజీఎం దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. 40 ఏళ్ల వయసు ఉంటాడని, కుటుంబ సభ్యులు ఇంతేజార్‌గంజ్ పోలీసులకు 8712685007 లేదా 8712685118 ద్వారా సంప్రదించవచ్చని పోలీసులు తెలిపారు. కాగా, రంగశాయిపేటకు చెందిన పరికిపండ్ల వరలక్ష్మీ ఈ నెల 17న ఇంట్లో దేవుడికి దీపం పెడుతుండగా ప్రమాదవశాత్తు చీర అంటుకుని ఒంటికి కాలిన గాయలయ్యాయి. కుటుంబ సభ్యులు ఎంజీఎం దవాఖానకు తరలించగా చికిత్సపొందుతూ మృతిచెందింది. కొడుకు సంతోష్ ఫిర్యాదు మేరకు మిల్స్‌కాలనీ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కళలకు నిలయం.. ఓరుగల్లు

- కుడా ప్రణాళిక అధికారి అజిత్‌రెడ్డి
- రెండోరోజు అలరించిన సహృదయ నాటిక పోటీలు

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 24: కళలకు నిలయం ఓరుగల్లు అని కుడా ప్రణాళిక అధికారి అజిత్‌రెడ్డి తెలిపారు. సహృదయ సాహిత్య సాంస్కృతిక సంస్థ వరంగల్ ఆధ్వర్యంలో రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ, తెలంగాణ రాష్ట్ర చలనచిత్ర డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్ సౌజన్యంతో హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్న తెలుగు భాషా ఆహ్వాన నాటక పోటీలు సోమవారం రెండో రోజుకు చేరాయి. సంస్థ అధ్యక్షుడు గిరిజా మనోహరబాబు అధ్యక్షతన సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. కళాకారులు, కవులు, సాహితీవేత్తల కోసం ప్రభుత్వం కళాక్షేత్రాన్ని ఏర్పాటు చేసిందన్నారు. ఇంటెలిజెన్స్ ఎస్పీ ఆర్.భాస్కర్ మాట్లాడుతూ కళాక్షేత్రాన్ని సంస్థలకు ఉచితంగా లేదా నామమాత్రపు రుసుముతో ఇస్తే కళాకారులకు ప్రోత్సాహకరంగా ఉంటుందన్నారు. రామన్ చిట్‌ఫండ్ అధినేతలు బన్న సుధాకర్, శ్రీరామోజు గిరిబాబు, మూర్తి, ప్రాయోజకులు తుమ్మూరి రామ్మోహన్, శ్రీరామోజు సుందరమూర్తి మాట్లాడారు. వనం లక్ష్మికాంతారావు, కుందావఝుల కృష్ణమూర్తి, డాక్టర్ ఏవీ నరసింహారావు, డాక్టర్ కేఎల్ఎన్ ప్రసాద్, బి.పురుషోత్తమరావు, ఎన్‌వీఎన్ చారి, డాక్టర్ రాధాకృష్ణ, లక్ష్మణ్‌రావు, కళా రాజేశ్వర్‌రావు, జూలూరి నాగరాజు, సీత వెంకట్, నాగిళ్ల రామశాస్త్రీ, రాష్ట్ర నాటక సమాజాల సమాఖ్య అధ్యక్షుడు ఆకుల సదానందం పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కుడా ప్రణాళిక అధికారి అజిత్‌రెడ్డి

ప్రేక్షకులకు కరువైన టాయిలెట్స్

కాళోజీ కళాక్షేత్రంలో టాయిలెట్స్ సౌకర్యం కరువైంది. గ్రీన్‌రూంలో ఉన్న ఒకే ఒక్క టాయిలెట్‌ను కళాకారులందరూ వాడుకోవడం ఇబ్బందిగా మారింది. తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. జిల్లా అధికారులు స్పందించి ప్రేక్షకుల కోసం ప్రత్యేకంగా ఆడిటోరియం కింది భాగంలో తాగునీటితోపాటు మూత్రశాల ఏర్పాటు చేయాలని ప్రేక్షకులు, కళాకారులు కోరుతున్నారు.

స్కావెంజర్ల వేతనాలు చెల్లించాలి

ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు

ఖిలావరంగల్, ఫిబ్రవరి 24: ప్రభుత్వ పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుతున్న స్కావెంజర్ల వేతనాలను వెంటనే అందించాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు డిమాండ్ చేశారు. సోమవారం వరంగల్ కలెక్టరేట్‌లో డీఆర్వో విజయలక్ష్మికి స్కావెంజర్ల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న స్కావెంజర్లకు గత ఏడాది జూన్ నుంచి వేతనాలు ఇవ్వలేదన్నారు. కనీస వేతన సవరణ చట్టం ప్రకారం నెలకు రూ.26వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మధ్యాహ్న భోజన పథకం ఉన్న కొన్ని పాఠశాలలను సీఎం బ్రేక్ ఫాస్ట్ కిందికి మార్చిన నాటి నుంచి ఆయా కార్మికులకు రూపాయి కూడా చెల్లించలేదన్నారు. రాగి జావా తయారీకి నెలకు రూ.2వేలు ఇస్తామని హామీ ఇచ్చిన ప్రభుత్వం ఇప్పటివరకు మంజూరు చేయలేదన్నారు. స్కావెంజర్లు, మధ్యాహ్న భోజన పథకం కార్మికులకు ప్రభుత్వం వెంటనే వేతనాలు అందించాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా సహాయ కార్యదర్శి మియాపురం గోవర్ధనాచారి, జిల్లా కార్యవర్గ సభ్యులు బొట్ల శ్రీనివాస్, స్కావెంజర్స్ ఎండీ సైదాబీ, రామారావు, ఎండీ పాషా, సుభాన, విజయ, మేకల కవిత, సూరయ్య, వినోద్, పద్మ, సునీత, విజయ, రమ, ధోనికెల లక్ష్మి, శ్వేత, బట్టు స్వరూప, పుష్పమ్మ పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు, స్కావెంజర్లు

ఎన్నిసార్లు విన్నవించాలి?

- బల్దియా గ్రీవెన్స్‌పై నగరవాసుల పెదవి విరుపు
- అధికారులు స్పందించడం లేదని బాధితుల ఆవేదన

వరంగల్, ఫిబ్రవరి 24 : బల్దియా గ్రీవెన్స్‌లో సమస్యలకు పరిష్కారం లభించకపోవడంతో మళ్లీ మళ్లీ అవే సమస్యలపై వినతులు వస్తున్నాయి. అనేక సార్లు వినతులు, ఫిర్యాదులు ఇచ్చినా అధికారులు పట్టించుకోవడం లేదని బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక సమస్యపై పదుల సార్లు వినతులు ఇచ్చినా స్పందించడం లేదని గ్రీవెన్స్‌పై పెదవి విరుస్తున్నారు. విషయాన్ని పలువురు బాధితులు సోమవారం కమిషనర్ అశ్వినీ తానాజీ వాకడే దృష్టికి తీసుకొచ్చారు. కార్పొరేషన్ కౌన్సిల్ హాల్‌లో ఆమె గ్రీవెన్స్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. లక్ష్మీగణపతి కాలనీలో రోడ్డును అక్రమించి, రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్న వ్యక్తిపై గత గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా అధికారులు చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. మడికొండలోని మెర్సీస్క్రాప్ షాపు నుంచి దుర్వాసన, పురుగులు చుట్టుపక్కల నివాసాల్లోకి వస్తున్నాయని, చర్యలు తీసుకోవాలని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదని కాలనీవాసులు తెలిపారు. 2వ డివిజన్ పరిధిలోని విజయలక్ష్మి కాలనీలో కనీస వసతులు లేవని, స్ట్రీట్ లైట్లు, డ్రెయినేజీ, సీసీ రోడ్డు వసతి కల్పించాలని కాలనీవాసులు కోరారు. 59వ డివిజన్ ఎక్సైజ్ కాలనీ ఆర్చీ వద్ద నిబంధనలకు విరుద్ధంగా భవనం నిర్మిస్తున్నారని, దీనిపై ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కార్పొరేటర్ గుజ్జల వసంత ఫిర్యాదు చేశారు. ప్రగతినగర్ కాలనీలో రహదారికి అడ్డంగా ఉన్న పిల్లర్‌ను తొలగించాలని పలుమార్లు ఫిర్యాదు చేసినా స్పందించలేదని కాలనీవాసులు విన్నవించారు. 48వ డివిజన్ దర్గా కాజీపేటలోని మార్కండేయ వీధిలో సీసీ రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని, వెంటనే రోడ్డు నిర్మించాలని కాలనీవాసులు కోరారు. రోడ్డు మధ్యలో శిథిలావస్థలో ఉన్న విద్యుత్ స్తంభం తొలగించాలని అనేకసార్లు గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా స్పందించడం లేదని వాపోయారు. కమిషనర్ అధికారులతో మాట్లాడుతూ గ్రీవెన్స్ వినతుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టిసారించాలని ఆదేశించారు. గ్రీవెన్స్‌లో మొత్తం 65 వినతులు రాగా, టౌన్‌ప్లానింగ్ విభాగానికి 33, ఇంజినీరింగ్ విభాగం 13 , ప్రజారోగ్య విభాగం 8, పన్నుల విభాగం 10, తాగునీటి సరఫరా ఒకటి వచ్చినట్లు పేర్కొన్నారు. అదనపు కమిషనర్ జోనా, ఎస్ఈ ప్రవీణ్‌చంద్ర, సీఎంహెచ్‌వో రాజారెడ్డి, బయలాజిస్ట్ మాధవరెడ్డి, హెచ్‌వో రమేశ్, లక్ష్మారెడ్డి, ఇన్‌చార్జి సిటీప్లానర్ రవీంద్రరాడేకర్, డిప్యూటీ కమిషనర్లు ప్రసన్నరాణి, రాజేశ్వర్, పన్నుల అధికారి రామకృష్ణ పాల్గొన్నారు.

వినతులు, ఫిర్యాదులు స్వీకరిస్తున్న కమిషనర్

మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించాలి

ఖిలావరంగల్, ఫిబ్రవరి 24: ప్రతీ మహిళ ఆర్థిక క్రమశిక్షణ పాటించి ఆర్థికాభివృద్ధి సాధించాలని కలెక్టర్ సత్యశారద అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ఆర్బీఐ వారోత్సవాల్లో భాగంగా ఆర్థిక క్రమశిక్షణ వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆమె మాట్లాడుతూ ఈనెల 28వ తేదీ వరకు మహిళలకు ఆర్థిక అక్షరాస్యత, మహిళా శ్రేయస్సు కోసం జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో ఆర్థిక క్రమశిక్షణ కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. మహిళలకు అవగాహన కల్పించాలన్నారు. లీడ్ బ్యాంక్ మేనేజర్ హవేలి రాజు పాల్గొన్నారు.

రుణం చెల్లించలేదని రైతు భూమిలో ఎర్రజెండాలు

భూమిని ఐడెంటిఫై చేసేందుకేనన్న డీసీసీ బ్యాంకు అధికారులు

సంగెం, ఫిబ్రవరి 24 : పంట రుణం చెల్లించలేదని బ్యాంకు అధికారులు రైతు భూమిలో ఎర్రజెండాలు పాతిన ఘటన మండలంలో సోమవారం జరిగింది. బ్యాంకు అధికారులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని ఎల్లుగ్గర్‌స్టేషన్ తండాకు చెందిన రైతు గుగులోత్ మురళీ మూడేళ్ల క్రితం పంట రుణం తీసుకున్నాడు. సుమారు రూ.2లక్షలపైగా రుణం చెల్లించాల్సి ఉండగా, ఎన్నిసార్లు వెళ్లినా రుణం చెల్లించకపోవడంతో భూమిని ఐడెంటిఫై చేసి జెండాలు పాతినట్లు బ్యాంకు అధికారులు తెలిపారు. డీసీసీబీ డీజీఎం ఉషశ్రీ, జీఎం అశోక్, ఏజీఎం మధు, బీఎం ప్రీతి, సూపర్‌వైజర్ నాగరాజు, సంగెం సొసైటీ సీఈవో జక్క సుభాష్ పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం అందజేస్తున్న లేతాకుల రంగారెడ్డి

రాయపర్తి, ఫిబ్రవరి 24: మండలంలోని పలు గ్రామాల్లో బీఆర్ఎస్ కార్యకర్తలు ఇటీవల పలు కారణాలతో మృతిచెందగా మైలారం గ్రామానికి చెందిన బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పరుపాటి శ్రీనివాస్‌రెడ్డి తన ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధుల ద్వారా బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం అందజేశారు. రూ.5వేలతోపాటు ఒక్కో కుటుంబానికి 50కిలోల బియ్యం, వంట నూనె, నిత్యావసర వస్తువులు ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధి లేతాకుల రంగారెడ్డి అందజేశారు. మైలారం గ్రామానికి చెందిన గాడిపల్లి సారయ్య, కొండూరులో చిర్ర నితిన్‌కుమార్, ఊకల్‌లో పోలెపాక సూరయ్య కుటుంబాలను పరామర్శించి ఆర్థికసాయం అందజేశారు. ఎస్ఆర్ఆర్ ఫౌండేషన్ ప్రతినిధులు జినుగు అనిమిరెడ్డి, రంగు కుమార్, కర్ర రవీందర్‌రెడ్డి, సంది దేవేందర్‌రెడ్డి, పూస మధు, కుందూరు రాంచంద్రారెడ్డి, సదా శ్రీనివాస్, పోలెపాక భిక్షపతి, గజవెల్లి ప్రసాద్, దేశబోయిన ఉపేందర్ సత్యనారాయణరావు, పులి సోమయ్య, పెండ్లి వెంకన్న, ఎనబోతుల మల్లేశ్, దేవేందర్, పరుపాటి రవీందర్‌రెడ్డి, సంది దేవేందర్‌రెడ్డి, గబ్బెట కొమురయ్య, యాకయ్య, కొమ్ము రాజు, చిర్ర దర్గయ్య, గ్రామ తాజా మాజీ సర్పంచ్ భూక్యా భద్రూనాయక్, బానోతు రమేశ్, లాలూనాయక్, రమేశ్, మంచ్యా, రవి, రమేశ్ పాల్గొన్నారు.

చేనేత మగ్గాలను జియోట్యాగ్ చేయాలి

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 24: చేనేత మగ్గాలను జియోట్యాగ్ చేసి, నేతన్నలను ఆదుకోవాలని తెలంగాణ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు తాటిపాముల వెంకట్రాములు ఒక ప్రకటనలో కోరారు. జియోట్యాగింగ్ ద్వారా చేనేత కార్మికులు, అనుబంధ కార్మికులకు నేతన్న పొదుపు పథకం (త్రిఫ్ట్) వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. చేనేత అభయ హస్తం అమలు వేగవంతం చేసి, అర్హులైన నేత కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అందించాలని కోరారు. ముఖ్యంగా 12 ఏళ్లుగా చేనేత సహకార సంఘాలకు ఎన్నికలు నిర్వహించకపోవడంతో సహకార వ్యవస్థ నిర్వీర్యమైపోయిందని, కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహిస్తామంటూనే వాయిదా వేయడంలో ఆంతర్యమేమిటో అర్థం కావడం లేదన్నారు. కాలయాపన చేయకుండా చేనేత సహకార సంఘాలు, టెస్కోకు ఎన్నికలు నిర్వహించాలని కోరారు.

కేఎంసీ హాస్టల్ కార్మికుల ధర్నా

ధర్నా చేస్తున్న హాస్టల్ కార్మికులు

వరంగల్ చౌరస్తా, ఫిబ్రవరి 24: కాకతీయ మెడికల్ కళాశాల పరిధిలోని ఉమెన్స్, మెన్స్ హాస్టళ్లలో విధులు నిర్వర్తిస్తున్న కార్మికులు సోమవారం ఉదయం ధర్నా చేపట్టారు. తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ కేఎంసీ హాస్టల్ వర్కర్స్ విభాగం ఆధ్వర్యంలో కార్మికులు విధులను బహిష్కరించి కళాశాల ప్రధాన ద్వారం ఎదుట ఆందోళన చేపట్టారు. సుమారు ఆరు నెలలుగా వేతనాలు అందించకపోవడంతో ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. విధులకు కొనసాగింపుగా ప్రభుత్వం అనుమతులు మంజూరు చేయకపోగా వేతనాలు చెల్లించకుండా ఇబ్బందులకు గురిచేస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇన్నర్‌వీల్ క్లబ్ సేవలు ప్రశంసనీయం

పోచమ్మమైదాన్, ఫిబ్రవరి 24: ఇన్నర్‌వీల్ క్లబ్ సేవలు ప్రశంసనీయమని డిస్ట్రిక్ట్ 315 చైర్మన్ ప్రేమలత అన్నారు. వరంగల్ వాసవీకాలనీలో ఇన్నర్‌వీల్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం పలు సేవా కార్యక్రమాలు నిర్వహించారు. క్లబ్ తరఫున ఇటీవల నిర్వహించిన సబిత టాలెంట్ టెస్ట్‌లో విజేతలైన 8, 9 తరగతుల విద్యార్థినీ విద్యార్థులకు ప్రథమ బహుమతిగా రూ.2వేల, ద్వితీయ బహుమతిగా రూ.1500, తృతీయ బహుమతి రూ.వెయ్యి అందజేశారు. లార్డ్ అనాథ వృద్ధుల ఆశ్రమానికి రూ.5వేల విలువైన వంట సామగ్రి, నిత్యావసర వస్తువులు, మహిళకు కుట్టు మిషన్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. క్లబ్ వ్యవస్థాపక మెంబర్ నేరెళ్ల శోభావతి, అధ్యక్షురాలు లావణ్య, సెక్రటరీ రేణుక, పీడీసీలు పద్మశర్మ, కస్తూరి ప్రమీల, సుమతినాయుడు, విజయగోపాల్, లత, సునీత పాల్గొన్నారు.

కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌పై పోరాడాలి

గిర్మాజీపేట, ఫిబ్రవరి 24: కేంద్రంలోని మోదీ సర్కారు ప్రవేశపెట్టిన కార్మిక, ప్రజా వ్యతిరేక బడ్జెట్‌పై పోరాడేందుకు కర్షక, కార్మికులు ముందుకు రావాలని సీఐటీయూ రాష్ట్ర కార్యదర్శి ఎస్ఎస్ఆర్ఏ ప్రసాద్ పిలుపునిచ్చారు. కేంద్ర బడ్జెట్‌పై నిరసిస్తూ సోమవారం జిల్లా సీఐటీయూ కార్యదర్శి రామస్వామి సమక్షంలో సాగర్ అధ్యక్షతన రత్న హోటల్‌లో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గత ఏడాది బడ్జెట్‌లో పారిశ్రామిక రంగానికి రూ.5,624కోట్లు కేటాయించగా, ఈ ఏడాది రూ.324కోట్లు కోత విధిస్తూ రూ.5,300 కోట్లు కేటాయించడం హేయమని మండిపడ్డారు. మోదీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులు, సంపన్నవర్గాలకు రాయితీలు ఇచ్చి ప్రోత్సహించడం దుర్మార్గమని అన్నారు. సీఐటీయూ నేతలు బ్రహ్మాచారి, రతన్‌గౌడ్, సదానందం, శంకర్, రాఘవరెడ్డి, రమేశ్, నరేశ్, యాదగిరి, శ్రీనివాస్, ఎండీ సలీం, సంపత్, మారయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

నర్సంపేట, ఫిబ్రవరి 24: అసైన్డ్ భూముల్లో రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తున్న వారిపై రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలని ఎంసీపీఐ(యూ) రాష్ట్ర కమిటీ సభ్యులు కన్నం వెంకన్న, గుండెబోయిన చంద్రయ్య, వంగాల రాగసుధ డిమాండ్ చేశారు. సోమవారం ఆర్డీవో ఉమారాణి, తహసీల్దార్ రాజేశ్‌కు వేర్వేరుగా వినతిపత్రాలు అందించారు. వారు మాట్లాడుతూ మాధన్నపేట రోడ్డు సర్వే నంబర్ 111లోని అసైన్డ్ భూమిలో అనుమతులు లేకుండా భూమి చదును చేసి విక్రయించేందుకు కొందరు యత్నిస్తున్నారని, రెవెన్యూ అధికారులు స్పందించి ప్రభుత్వ భూమిని పరిరక్షించాలని డిమాండ్ చేశారు. బైరబోయిన నర్సయ్య, ఎండీ పాషా, అస్గర్, చొప్పరి పద్మ, చింతకింది వనమ్మ, గోనెల అనిత, పెండ్యాల సరిత, సరోజన, సాంబ, అరుణ, నాగమణి, శివ, నాగరాజు ఉన్నారు.

మృతుడి కుటుంబానికి స్నేహితుల ఆర్థికసాయం

నర్సంపేట, ఫిబ్రవరి 24: మండలంలోని గురిజాల గ్రామానికి చెందిన స్టార్ యువసేన యూత్ సభ్యుడు దాసరి రాజు తండ్రి దాసరి కొమ్మాలు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. బాధిత కుటుంబాన్ని కొమ్మాలు చిన్ననాటి మిత్రులు సోమవారం పరామర్శించి, రూ.5వేల ఆర్థికసాయం అందించారు. ఆముదాల రమేశ్, చిన్నపెల్లి దిలీప్, దూడెల అశోక్, ఆముదాల సతీశ్, పాకాల రమేశ్, చిన్నపెల్లి నగేశ్, చిన్నపెల్లి శ్రీకాంత్ ఉన్నారు. ఇదే గ్రామానికి చెందిన పలువురు నాయకులు బాధిత కుటుంబానికి 50కిలోల బియ్యం అందజేశారు.